సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

ఉత్తమ ఫలితాలు సాధించాలి

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 24: పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో పదోతరగతి ఉత్తమ ఫలితాల సాధనకు జిల్లాస్థాయి ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రత్యేకాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 100 శాతం ఫలితాలు రావాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలో ఒక్కో ప్రభుత్వ పాఠశాలకు ఒక్కో ప్రత్యేకాధికారిని నియమించామన్నారు. పదోతరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయడం, ప్రత్యేక తరగతుల నిర్వహణ తదితర విషయాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ తగిన చర్యలు చేపట్టాలన్నారు. డీఈవో వెంకటేశ్వర్లు, జిల్లా నోడల్ అధికారి లింబాద్రి, జడ్పీసీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో శ్రీనివాసరావు, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శుల నియామకం

సంగారెడ్డి జనవరి 24 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో ముగ్గురు ప్రధాన కార్యదర్శులను నియమించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరీఅంజిరెడ్డి ప్రకటనలో తెలిపారు. అందోలు నియోజకవర్గానికి చెందిన కరణం అనంతరావు కులకర్ణి, సంగారెడ్డి నియోజకవర్గానికి చెందిన ఓదెల మాణిక్‌రావు, పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన కొల్కూరు రాజశేఖర్‌రెడ్డిలను జిల్లా ప్రధాన కార్యదర్శులుగా నియమించినట్లు చెప్పారు. ముగ్గురు ప్రధాన కార్యదర్శులు పార్టీ పటిష్టతకు అవసరమైన చర్యలు తీసుకుంటారని ఆమె తెలిపారు.

ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

ఉర్సులో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం

పటాన్‌చెరు, జనవరి 24: పటాన్‌చెరు పట్టణంలోని హజ్రత్ సయ్యద్ నిజాముద్దీన్ షహీద్ దర్గా ఉర్సు ఉత్సవాల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చాదర్ సమర్పించారు. దర్గా నిర్వాహకులు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా దర్గాలో ప్రార్థనలు చేస్తారన్నారు. దర్గా అభివృద్ధికి అండగా ఉంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ అష్జల్, ముస్లిం మతపెద్దలు లియాకత్ అలీ, వాజిద్ అలీ, హమీద్, అజ్మత్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు

కంది, జనవరి 24 : బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా బాలల పరిరక్షణ, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం కంది మండలం కాశీపూర్ కేజీబీవీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన హనుమంతరావు మాట్లాడుతూ బాలికలు జీవిత లక్ష్యాన్ని ఎంచుకొని ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, సైబర్ నేరాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి రత్నం మాట్లాడుతూ బాల్య వివాహాలు, ఆకృత్యాలు, అక్రమ రవాణా తదితర వాటిని వివరించారు. 1098, 100 టోల్‌ఫ్రీ నంబర్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి సంధ్యారాణి, లింగం, యాదగిరి, ప్రశాంతి, నారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెదక్ పార్లమెంట్ సీటు గొల్లకుర్మలకు కేటాయించాలి

- ఏకగ్రీవ తీర్మానం చేసిన గొల్లకుర్మల సంఘం
- బీఆర్ఎస్ అధిష్టానానికి తీర్మానం కాపీని అందజేసిన గొల్లకుర్మ సంఘం నాయకులు

సంగారెడ్డి, జనవరి 24 : త్వరలో జరుగనున్న పార్లమెంటు ఎన్నికల్లో మెదక్ పార్లమెంటు స్థానాన్ని బీఆర్ఎస్ పార్టీ గొల్లకుర్మలకు కేటాయించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బూరుగడ్డ నాగేశ్ అన్నారు. బుధవారం సంగారెడ్డి పట్టణంలోని గొల్లకుర్మ సంఘం జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో గొల్లకురుమలకు రెండు స్థానాలు కేటాయించాలని బీఆర్ఎస్ అధిష్టానానికి ఏకగ్రీవ తీర్మానాన్ని పంపించారు. అంతకుముందు తొలి గొల్లకుర్మల సంఘం జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి మరణించిన అంబారి రాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగేశ్ మాట్లాడుతూ డిసెంబరు 30న జరిగిన శాసనసభ ఎన్నికల్లో అన్ని పార్టీలు కుర్మలకు సీట్లు ఇవ్వలేదని, రాష్ట్రంలో 50లక్షలకుపైగా జనాభా కలిగిన గొల్లకుర్మలకు జనాభా ప్రకారం సీట్లు ఇవ్వాలని కోరారు. మెదక్ లోకసభ స్థానాన్ని గొల్లకుర్మలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కుర్మ జిల్లా సంఘం ఉద్యమకారుడు బీరయ్యాదవ్ పేరును ఏకగ్రీవంగా తీర్మానం చేసి బీఆర్ఎస్ పార్టీ అధిష్టానానికి పంపిస్తామన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు అనంతయ్య, దశరథ్, ఉత్తర్‌పల్లి మానయ్య, మిట్టప్ప, పోచారం రాములు, డాకూరి భూమయ్య, పెద్దగొల్ల నాగేశ్, శంకర్ యాదవ్, కృష్ణ, మల్లయ్య, రవి, నరేశ్ పాల్గొన్నారు.

గొల్లకుర్మల జిల్లా సమావేశంలో మాట్లాడుతున్న బూరుగడ్డ నాగేశ్

పదో తరగతి భవిష్యత్తుకు పునాది

- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి
- బీసీ వసతి గృహాల విద్యార్థులకు ప్రేరణ కల్పించిన కలెక్టర్

జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి, జనవరి 24: ప్రతి విద్యార్థి ఉజ్వల భవిష్యత్తుకు పదోతరగతి పునాది కావాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. బుధవారం పట్టణంలోని టీఎన్జీవోస్ భవన్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 20 బీసీ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రేరణ, శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని కలెక్టర్ వల్లూరు క్రాంతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం సత్యనారాయణ అందజేసిన ఆల్ ఇన్ వన్ బుక్స్, ఎగ్జామ్ ప్యాడ్స్, జామెట్రిక్ బాక్స్‌లను విద్యార్థులకు కలెక్టర్ అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో ఆత్మవిశ్వాసంతో ఉన్నతంగా ఎదగాలంటే చదువు ఒక్కటే మార్గమన్నారు. ప్రతి విద్యార్థికి పదోతరగతి చాలా ప్రధానమైందని, విద్యార్థి భవిష్యత్తుకు పునాది కావాలని ఆకాంక్షించారు. రానున్న 55రోజుల్లో ప్రణాళికతో బాగా చదువుకొని పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. పక్కా ప్రణాళికతో సబ్జెక్టుల వారీగా చదవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాభివృద్ధిశాఖ అధికారి జగదీశ్, పరిశ్రమల శాఖ జీఎం ప్రశాంత్, మోటివేట్ స్పీకర్ మల్లికార్జున్‌రావు, ఆయా సబ్జెక్టుల శిక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖాన తనిఖీ

సంగారెడ్డి అర్బన్, డిసెంబర్ 24: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, కలెక్టర్ క్రాంతితో కలిసి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దవాఖానలోని డెలివరీ వార్డు, చైల్డ్‌కేర్ లేబర్‌రూమ్‌లను పరిశీలించారు. ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వైద్యసిబ్బందికి సూచించారు. ఓపీ వద్ద మహిళలు భారీగా క్యూలో ఉండడం చూసి తక్షణమే ఓపీ కౌంటర్లు పెంచాలని, పేషెంట్ల సమస్యను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ అనిల్‌కుమార్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వాణి, గైనకాలజిస్ట్ జయశ్రీ తదితర వైద్య సిబ్బంది ఉన్నారు.

పరిశోధనల్లో సామాజిక అంశాలపై దృష్టి సారించాలి

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 24 : పీజీ పూర్తి చేసి పరిశోధనలకు వెళ్తున్న విద్యార్థులు సామాజిక సమస్యలపై లోతుగా అధ్యయనం చేసి వాటికి పరిష్కార మార్గాలను కనుక్కోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి విద్యార్థులకు పిలుపునిచ్చారు. 'పరిశోధనా విధానం-సవాళ్లు, పరిష్కారాలు' అనే అంశంపై తారా కళాశాల రాజనీతి శాస్త్రం, కంప్యూటర్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సెమినార్‌ను కలెక్టర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంతోపాటు జిల్లాలోనూ వాతావరణ, కాలుష్య, ఆరోగ్యం వంటి వివిధ సమస్యలు నెలకొన్నాయని గుర్తుచేశారు. ఆయా సామాజిక సమస్యలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయాలని, వాటిని అధిగమించేందుకు మార్గాలను పరిశోధనల ద్వారా సుగమం చేయాలని సూచించారు. అధ్యాపకులు, వ్యవస్థలు విద్యార్థులకు ఆ దిశగా సహకారం అందించాలన్నారు. సమస్యలు ఎంత కఠినంగా ఉన్నా వాటికి సాధారణ సమాధానాలను వెతకాలన్నారు. అంతకుముందు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న సేవలను వివరించారు. అనంతరం సెంట్రల్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ దార్ల వెంకటేశ్వరరావు, ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ డాక్టర్ మనుసింగ్ విద్యార్థులు చేపట్టాల్సిన పరిధోధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తారా ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు రచించిన పుస్తకాలను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్, వైస్ ప్రిన్సిపాళ్లు ప్రవీణ, డాక్టర్ వెంకటేశం, జాతీయ సెమినార్ కన్వీనర్లు డాక్టర్ జోత్స్న, డాక్టర్ నాగప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జగద్విర్, డాక్టర్ సిద్ధులు, డాక్టర్ పద్మజ, రాష్ట్రంలోని వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తారా కళాశాల అధ్యాపకులు రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ క్రాంతి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కొన్యాలలో తాగునీటి ట్యాంకు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర, జనవరి 24: ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రాధాన్యతపరంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానన్నారు. పార్టీలకతీతంగా ప్రజాసంక్షేమం, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింహులు, జడ్పీటీసీ ఆంజనేయులు, సర్పంచ్‌లు మాధవి, మాణిక్యరెడ్డి, దీపికారెడ్డి, సుధాకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు వెంకటయ్య, విఠల్‌రెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, రామచంద్రారెడ్డి, దుర్గారెడ్డి, బుచ్చిరెడ్డి, శివశంకర్‌రావు, శ్రీకాంత్, యాదగిరి, మధు, రాములు, నవీన్‌గౌడ్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

జహీరాబాద్, జనవరి 24: గ్రామాల అభివృద్ధికి పరిశ్రమల యాజమాన్యాలు సహాయ సహకారాలు అందించాలని సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం జహీరాబాద్ మండలంలోని బుచినెల్లి గ్రామంలో సీఎస్ఆర్ నిధులతో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, విద్యుత్ దీపాలు ఏర్పాటుచేసే పనులను ప్రారంభించారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పరిశ్రమల యాజమాన్యాలు తమవంతుగా సీఎస్ఆర్ నిధులు ఖర్చు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవకురాలు పద్మకు సేవారత్న అవార్డు

స్వచ్ఛంద సేవకురాలు పద్మకు అవార్డు ఎంపిక పత్రాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

పటాన్‌చెరు, జనవరి 24 : స్వచ్ఛంద సేవకురాలు పద్మ జాతీయ సేవారత్న అవార్డుకు ఎంపికయ్యారు. బుధవారం మండలంలోని ఇస్నాపూర్‌లో పద్మ మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులకు స్వయం ఉపాధి కోసం శిక్షణను ఉచితంగా అందజేస్తున్నానని చెప్పారు. తన సేవలను గుర్తించిన బహుజన సాహిత్య అకాడమీ నేషనల్ కమిటీ ఇండియా వారు సేవారత్న అవార్డుకు ఎంపిక చేశారన్నారు. ఎంపిక చేసిన ధృవపత్రాన్ని హైదరాబాద్ కార్యాలయంలో అందజేసి సత్కరించారని తెలిపారు. తనకు అవార్డు రావడానికి అండగా నిలిచిన మహిళలకు, బహుజన అవార్డు సెలక్షన్ కమిటీ నేషనల్ చైర్మన్ నల్ల రాధాకృష్ణకు ధన్యవాదాలు తెలిపారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

కోహీర్, జనవరి 24: విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా ఆర్‌బీఎస్‌కే అధికారి సిద్ధార్థ్ అన్నారు. బుధవారం మండలంలోని దిగ్వాల్ గురుకుల పాఠశాలో(ఆర్‌బీఎస్‌కే) రాష్ట్రీయ బాలస్వస్థ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థుల్లో హిమోగ్లోబిన్ శాతాన్ని తెలుసుకునేందుకు రక్తపరీక్షలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనీమియా రహిత దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు నవీన్‌కుమార్, నరేందర్, సర్ఫరాజ్, ఆర్‌బీఎస్‌కే డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, బాపమ్మ పాల్గొన్నారు.

ఉపాధిహామీపై సమీక్ష

కల్హేర్, జనవరి 24 : ఉపాధిహామీ కింద ప్రతి పంచాయతీలో రోజూ 50మంది కూలీలు పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఏపీడీ రాజు అన్నారు. బుధవారం కల్హేర్‌లోని మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధిహామీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో నర్సరీ ఏర్పాటు చేసి మొక్కలు పెంచేందుకు పనులు చేపట్టాలన్నారు. సంవత్సర కాలంపాటూ ఉపాధి పనులు చేపట్టేందుకు గ్రామ పంచాయతీ, మండల, జడ్పీల ఆమోదం తీసుకునేలా నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఉపాధి ఈసీ వేణుమాధవ్, తదితర అధికారులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

అందోల్, జనవరి 24 : ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన జోగిపేట పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అక్సానిపల్లి గ్రామానికి చెందిన కొత్తగొల్ల మల్లేశం(24) బైక్‌పై వెళ్తుండగా జోగిపేటలోని హీరో షోరూం వద్ద నారాయణఖేడ్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. అతడికి తీవ్రగాయాలు కాగా స్థానికులు ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

బొల్లారం, జనవరి 24 : వార్డుల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అధికారులను ఆదేశించారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిదో వార్డులో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు కాలనీలో నెలకొన్న విద్యుత్, డ్రైనేజీ, నీటి కొరత సమస్యలను చైర్‌పర్సన్‌కు విన్నవించారు. సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని కమిషనర్ సంగారెడ్డిని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కోలన్ బాల్‌రెడ్డి, ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది ప్రశాంత్, స్థానికులు వీరారెడ్డి, నబి, రవి, ఆజాం, రాఘవి, లలిత, సౌజన్య, కాలనీ యువకులు, మహిళలు పాల్గొన్నారు.

ఎనిమిదో వార్డులో మహిళలతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రోజారాణి

మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, మున్సిపల్ చైర్మన్ తుమ్మల

అమీన్‌పూర్, జనవరి 24: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బంధంకొమ్ము ప్రధాన రహదారిపై ఏర్పడిన మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. బుధవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, చందానగర్ కార్పొరేటర్ మంజులారఘునాథ్‌రెడ్డిలతో కలిసి సమస్యను పరిశీలించారు. కొద్దిరోజులుగా బంధంకొమ్ము నుంచి వస్తున్న మురుగునీరు ప్రధాన రహదారిపై చేరుతుండడం వల్ల దుర్వాసన వస్తున్నదన్నారు. బంధంకొమ్ము నుంచి వచ్చే మురుగునీటిని చందానగర్ ప్రధాన కాలువకు అనుసంధానం చేయడం వల్ల సమస్యను పరిష్కరించవచ్చని తుమ్మల పాండురంగారెడ్డి ఎమ్మెల్యే గాంధీకి సూచించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన గాంధీ త్వరలోనే పనులను ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, కౌన్సిలర్ బిజిలి రాజు పాల్గొన్నారు.

సాయినగర్‌కాలనీలో బస్తీదర్శన్

సీసీ రోడ్డు కోసం కొలతలు తీసుకుంటున్న అధికారులు, పక్కన కార్పొరేటర్ పుష్పానగేశ్

రామచంద్రాపురం, జనవరి 24 : ఆర్సీపురం డివిజన్‌లోని సాయినగర్‌కాలనీలో కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ అధికారులతో కలిసి బస్తీదర్శన్ నిర్వహించారు. కాలనీలో తిరుగుతూ స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు నంబర్ 5లో సీసీరోడ్డు వేయాలని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. వీధి దీపాలు, డ్రైనేజీలను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం సీసీరోడ్డు కోసం అధికారులు కొలతలు తీసుకున్నారు. ఆమె వెంట ఏఈ ప్రభు, కాలనీ అధ్యక్షుడు లక్ష్మణ్, యాదిరెడ్డి, ప్రీతిగౌడ్, జగన్ గౌడ్, వెంకటేశ్వర్లు, కృష్ణకుమార్, విష్ణు, రమేశ్, అర్చన, విశాలి ఉన్నారు.

హిందువుల మనోభావాలు దెబ్బ తీస్తే సహించం

- దౌల్తాబాద్‌లో శ్రీరామ భక్తుల ఆందోళన

హత్నూర, జనవరి 24: హిందువుల మనోభావాలు దెబ్బతీస్తే సహించేదిలేదని హిందూసంఘాల నాయకులు హెచ్చరించారు. హత్నూర మండలం దౌల్తాబాద్‌లో అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా గ్రామాల్లో కట్టిన కాషాయజెండాలను పోలీసులు పంచాయతీ సిబ్బందితో తొలిగించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఎదుట శ్రీరామ భక్తులు పెద్దసంఖ్యలో ఆందోళన చేపట్టడంతోపాటు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కాషాయజెండాలను ఎందుకు తొలిగించారంటూ పోలీసులు, అధికారులను నిలదీశారు. తొలిగించిన జెండాలను తిరిగికట్టాలని పట్టుబట్టడంతో తిరిగి కాషాయజెండాలను కట్టించారు. శ్రీరామ పల్లకీసేవపై బూటు విసిరినందుకు చేపట్టిన నిరసనలో ఓ పండ్ల దుకాణాన్ని దగ్ధం చేయడంతో పోలీసులు కొంతమంది శ్రీరామ భక్తులను అదుపులోకి తీసుకొని జిన్నారం పోలీస్‌స్టేషన్‌కు తరలించడంతో శ్రీరామ భక్తులు పెద్దసంఖ్యలో దౌల్తాబాద్‌కు చేరుకొని ఆందోళన చేపట్టారు. జైశ్రీరాం అంటూ బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ సంఘాల నాయకులు మాట్లాడుతూ హిందువుల మనోభావాలు దెబ్బతీస్తే సహించేదిలేదని హెచ్చరించారు. దౌల్తాబాద్‌లో మూడు రోజులుగా పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. పోలీసులు గ్రామంలో నిరంతరం గస్తీ నిర్వహిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

మోతీమాత జాతరకు పోటెత్తిన భక్తజనం

జహీరాబాద్, జనవరి 24: మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌పల్లి తండాలో మరిగమ్మ మోతీమాత జాతర ప్రారంభమైంది. బుధవారం మోతీమాతకు గిరిజనులు ప్రత్యేక పూజలు చేసి జాతరను ప్రారంభించారు. ఆలయం ఎదుట ఉన్న యజ్ఞగుండంలో పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భారీగా గిరిపుత్రులు తరలిరావడంతో ప్రకృతి పులకించింది. గిరిజనుల ఆరాధ్యదైవం మరిగమ్మ మోతీమాత దేవస్థానం ప్రతినిధులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. కొత్తగా పెండ్లయిన వధూవరులు, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి వేలాదిమంది తరలివచ్చి మోతీమాతను దర్శించుకుని పూజలు చేసి ముడుపులు కడుతున్నారు.

యజ్ఞగుండంలో నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

- సోషల్ మీడియాలో రెచ్చగొడితే

ఊరుకోం

- వాట్సాప్ గ్రూపుల్లో ఫేక్ మెసేజ్‌లు వస్తే అడ్మిన్లపై చర్యలు
- సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్

సంగారెడ్డి, జనవరి 24: సోషల్ మీడియాలో ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ చెన్నూరి రూపేశ్ హెచ్చరించారు. బుధవారం ఎస్పీ నమస్తేతెలంగాణతో మాట్లాడుతూ మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించినా, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా కఠిన చర్యలు తప్పవన్నారు. ముఖ్యంగా వాట్సాప్ గ్రూపుల్లో ఫేక్ మెసేజ్‌లు, వీడియోలు పెట్టినా ఆ గ్రూప్ అడ్మిన్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. సెల్‌ఫోన్లలో వచ్చే ప్రకటనలపై జిల్లావాసులు అప్రమత్తంగా ఉండాలని, వదంతులు నమ్మవద్దని సూచించారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుని అలాంటి వారిపై కఠనంగా వ్యవహరిస్తామన్నారు. ఒకరి మత సంప్రదాయాలను మరొకరు గౌరవించినప్పుడే మత సామరస్యం నెలకొంటుందన్నారు. అన్ని మతాల ప్రజలు సోదర భావంతో ఉండాలని, కులమతాలకు అతీతంగా పండుగలు జరుపుకోవాలని ఎస్పీ రూపేశ్ వెల్లడించారు.

ఆరుగురు సైబర్ నేరస్తులు అరెస్ట్

సంగారెడ్డి, జనవరి 24 : దేశవ్యాప్తంగా సైబర్ నేరాలకు పాల్పడుతూ 5,303కుపైగా నేరాలకు పాల్పగిన ఆరుగురు సైబర్ నేరస్తులను అరెస్ట్ చేసి అదనపు ప్రథమశ్రేణి న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చామని ఎస్పీ చెన్నూరి రూపేశ్ బుధవారం ప్రకటనలో వెల్లడించారు. దేశవ్యాప్తంగా 5303 కేసుల్లో నిందితులుగా ఉన్న ఆరుగురు నేరస్తులు ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతూ రాష్ట్రంలో 800కేసులు, జిల్లాలో 24 కేసుల్లో నిందితులుగా ఉన్నారన్నారు. నిందితులు సైబర్ నేరాలకు పాల్పడడానికి 2813-ఫోన్ నంబర్స్, 115-MIEISలను వినియో